క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న వీరారెడ్డి

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌ను ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి, శ్రీకాకుళం, మన్యం జిల్లాల అనుబంధ విభాగాల పరిశీలకుడు వనిపెంట వీరారెడ్డి మర్యాదపూర్వకంగా ముబగాంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించారు.

సేవలు అభినందనీయం



శ్యామలను సత్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని సత్యవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన పాగోటి శ్యామల సేవలు అభినందనీయమని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఆమెను పాఠశాలలో గురువారం సత్కరించారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఆమె కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు, హెచ్‌ఎం ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు రంది అప్పారావు, ఎ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలోని రావివలస గ్రామంలో సర్పంచ్ వండాన కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ముందుగా మురుగునీటి కాలువులు, వీధులకు ఇరువైపులా ఉన్న చెత్త, పూడికను తొలగించారు. తదుపరి బోర్లు, నేలబావుల వద్ద ఈగలు, దోమలు చేరకుండా క్లోరినేషన్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, ఏఎన్‌ఎం తేజ, ఆశావర్కర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవోగా వంశీ ప్రియ



బాధ్యతలు స్వీకరిస్తున్న వంశీప్రియ

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా శుక్రవారం సీహెచ్ వంశీ ప్రియ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సీడీపీవో హెచ్.కె.కామాక్షి జూన్ నెలలో పదవీ విరమణ చేశారు. దీంతో అనకాపల్లి జిల్లా నుంచి పదోన్నతిపై వంశీ ప్రియ ఇక్కడికి వచ్చారు. ఆమెకు స్థానిక కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ గిరిధర్

పాతపట్నం: ఇంటి నుంచి బయటకు వెళ్లే విద్యార్థినులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని టెక్కలి ఏఎస్‌ఐ ఎం.గిరిధర్ సూచించారు. స్థానిక దువ్వారివీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు ఆధ్వర్యంలో శక్తియాప్‌పై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తులపై ఆకర్షితులు కావొద్దని, సోషల్ మీడియాలో లేనిపోని పరిచయాలు పెంచుకోవద్దని, చదువుపై శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ ఆర్.మృదులమ్మ, ఉపాధ్యాయులు కె.ఉషా, బి.భార్గవి, టి.సుధారాణి, కె.అప్పారావు, కె.కోటేశ్వరరావు, డి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

పాతపట్నం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ కేటగిరిలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 5వ తరగతిలో 34, 6వ తరగతిలో 13, 7వ తరగతిలో 18, 10వ తరగతిలో 4 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీలో ఒకటి, ఎంపీసీలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు నేరుగా ప్రిన్సిపాల్ సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 83745 23273 సంప్రదించాలని కోరారు.

అడుగుకో గుంత.. ప్రజలకు చింత..!



గోతులమయమైన లబ్బరోడ్డు

- అధ్వానంగా గ్రామీణ ప్రాంత రహదారులు
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్న వైనం
- మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం

కొత్తూరు: గ్రామీణ రహదారుల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రోడ్లు బాగు చేస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారాల్లో ఊదరగొట్టారు. అయితే ఏడాది గడుస్తున్నా రోడ్లు బాగు చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. పాతపట్నం నియోజకవర్గం పరిధి కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, మెళియాపుట్టి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. వర్షం పడితే చెరువులను తలపిస్తూ బురదమయంగా మారుతున్నారు. రోడ్లపైన గుంతల్లో నీరునిల్వ అవుతుండడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కొత్తూరు మండలంలోని పాతపాడు, కడుము, గురంగి, దిమిలి, రాయల, ఓండ్రుజోల, లబ్బ, ఆకులతంపర కాలనీ, పాతపట్నం మండలంలోని శివ్వ జగన్నాథపురం, తెంబూరు రైల్వేస్టేషన్ నుంచి బడ్డుమర్రి, టి.కొత్తూరు, పాతపట్నం ఆల్‌ఆంధ్రా రోడ్డు, మెళియాపుట్టి మండలంలోని మాకన్నపల్లి, కొత్తూరు, సంతలక్ష్మీపురం, ముకుందాపురం, పెద్దకోదారి, ఎల్‌ఎన్‌పేట మండలంలోని బొత్తాడిసింగి, జాడుపేట, కొమ్మువలస, సిద్ధాంతం, గొట్టిపల్లి, హిరమండలంలోని కిట్టాలపాడు, భగీరథపురం, రుగడ–కొమనాపల్లి, కొండరాగోలు గ్రామాలతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. దీంతో రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తెంబూరు రోడ్డు దుస్థితి



పాతపాడు రోడ్డు దుస్థితి



రాళ్లుతేలిన సిద్ధాంతం రోడ్డు

ప్రతిపాదనలు పంపించాం

పాతపట్నం నియోజకవర్గం పరిధి ఐదు మండలాల్లోని పలు గ్రామాలకు రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. పనులు మంజూరు అయిన వెంటనే ప్రారంభించి రోడ్లు బాగు చేస్తాము.

– ఎ.చంద్రినాయుడు, పంచాయతీరాజ్ డీఈఈ, కొత్తూరు సబ్ డివిజన్

ప్రాణసంకటంగా ఉంది



కొత్తూరు మండలంలోని మారుమూల లబ్బ గ్రామానికి వచ్చే రోడ్డు మీద ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. రోడ్డుపై గోతులు కావడంతో పాటు రాళ్లు తేలిపోయాయి. దీంతో ఈ రోడ్డు మీద ప్రయాణం చేయలేకపోతున్నాం. వర్షాకాలం వచ్చిందంటే గోతులలో నీరు చేరడంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– జి.భానుమూర్తి, లబ్బ, కొత్తూరు మండలం

గోతులతో ప్రమాదం

కొత్తూరు మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కడుము గ్రామానికి వచ్చే రోడ్డుపై అడుగు అడుగున గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డు మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు మీద గోతులతో నరకాన్ని అనుభవిస్తున్నాము. రాళ్లు తేలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బూరాడ భాస్కరరావు, పాతపాడు, కొత్తూరు మండలం

● భక్తిశ్రద్ధలతో పూజలు

శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్ర నామార్చనలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: గార్లపాడులో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



కొత్తూరు: గూనభద్రలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పాతపట్నం: సత్యసాయిబాబా మందిరంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



ఆమదాలవలస: లక్ష్మీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నీరుగారుతున్న లక్ష్యం..!



కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

- నిర్వహణ లోపంతో డకరవలస ఎత్తిపోతల పథకం
- రైతులకు అందని సాగునీరు
- పట్టించుకోని అధికారులు

సరుబుజ్జిలి: ప్రతీ సెంటు భూమికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మండలంలోని డకరవలస గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని అప్పట్లో ఏర్పాటు చేశారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి రూ.47 కోట్లతో ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. అయితే నిర్వహణ విషయంలో ప్రస్తుతం అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వలన పథకం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని రైతులు వాపోతున్నారు.

ఇదీ విషయం...

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టకముందు టీడీపీ హయాంలో చిగురువలస, డకరవలస, కొండ్రగూడ, తాటికొండ, సుభద్రాపురం తదితర గ్రామాలకు సంబంధించిన సుమారు 700 ఎకరాల భూమిలో పంటలు సాగునీరు అందక ప్రతిఏటా నాశనమయ్యేవి. అధిక శాతం మైదాన, కొండప్రాంత భూములు కావడంతో వర్షపు నీటి ఆధారంగానే సాగు చేసేవారు. సాగునీటి సమస్య పరిష్కరించాలని అప్పట్లో పలుమార్లు ఇచ్చిన వినతులు అధికారులు, నేతలు బుట్టదాఖలు చేశారే తప్ప పరిష్కరించలేదు. అనంతరం వైఎస్సార్ పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల ఆయకట్టు రైతులు సాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పదవిలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే ముఖ్యమంత్రి అయిన తర్వాత డకరవలస ఎత్తిపోతల పథకాన్ని 8 నెలలు కాలంలో నిర్మించి పంటలకు సాగునీరు అందించారు.

పథకం ఉన్నా ప్రయోజనం సున్నా

అయితే ప్రస్తుతం పథకం ఉన్నా ప్రయోజనం సున్నా అన్నట్లుగా ఉంది రైతుల పరిస్థితి. నిర్వహణలో లోపాలు వలన రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ పథకానికి కొత్తకోట మినీ రిజర్వాయర్ నుంచి వంశధార పిల్ల కాలువ ద్వారా సాగునీరు అందించే విధంగా నిర్మాణం చేపట్టారు. అయితే రిజర్వాయర్‌లో ఆక్రమణలతో పాటు తరుచూ గుర్రపు డెక్క పేరుకుపోవడం, రిజర్వాయర్ నుంచి సాగునీరు ప్రవహించే పిల్ల కాలువ పూర్తిగా పూడికుపోవడంతో సాగునీరు అందడం లేదు. అలాగే తరుచూ విద్యుత్ మోటార్లు మొరాయించడం వలన సాగునీటి పంపిణీకి అడ్డంకులు ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీనివలన ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తరుచూ మొరాయిస్తున్న విద్యుత్ మోటార్లు



తుప్పుపట్టిన సాగునీటి పైపులైన్లు

ఆశయాలకు తూట్లు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని మనసుపెట్టి ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. అయితే దీని నిర్వహణ విషయంలో అధికార యంత్రాంగం సరిగా దృష్టి సారించకపోవడం వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు సంబంధించిన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం తక్కువ కావడం వలన కొన్ని గ్రామాలకు సాగునీరు అందడం లేదు.

– సురవరపు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

పట్టించుకునేవారే కరువు



కొత్తకోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకానికి నీరు ప్రవహించక ప్రతీఏటా నీటి కష్టాలు వస్తున్నాయి. వినతులు ఇచ్చినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఎత్తిపోతల పథకం నిర్వహణ సక్రమంగా లేదు. దీనివలన నీరు ప్రవహించే కాలువ పూడికపోవడంతో సాగునీరు అందడం లేదు.

– చల్ల యర్రయ్య, చిగురువలస, సరుబుజ్జిలి

మరమ్మతులు ప్రారంభించాం

ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టి రంగులు వేయిస్తున్నాము. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

– జగదీశ్వరరావు, వంశధార జేఈ

పింఛన్ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి..?

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పింఛన్ల డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అర్హులైనవారికి కొత్త పింఛన్లు ఇవ్వలేదని దుయ్యబట్టారు. కాగా పింఛన్ లబ్ధిదారుడైన భర్త మరణించిన వారికి ఆగస్టు నెలకు సంబంధించి పింఛన్ మంజూరవ్వగా, దీనికి సంబంధించి బయోమెట్రిక్ వేయించి వారికి డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారని, అయితే ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. దీంతో బయోమెట్రిక్ వేసి డబ్బులు తీసుకోని వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు.

తక్షణమే వారి డబ్బులు వారికి ఇవ్వాలని, లేకపోతే దోచుకున్నవారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. బయోమెట్రిక్ వేసినవారికి డబ్బులు ఇవ్వకపోవడంపై అధికారులు కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మూడడ్ల రమణ, గురుగుబెల్లి కృష్ణ, బాల సుందరం, అన్నెపు కృష్ణ తదితరులు ఉన్నారు.

ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ



భూములు పరిశీలిస్తున్న డీటీ గోవిందరావు తదితరులు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఊసవానిపేట గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులు సన్నద్ధమయ్యారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా వచ్చాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఆమదాలవలస డిప్యూటీ తహసీల్దార్ పప్పల గోవిందరావు ఆధ్వర్యంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం భూసేకరణ కార్యక్రమం నిర్వహించారు. కసింవలసపేట రెవెన్యూ గ్రామం పరిధిలో భూములు, నిర్మాణాలు పరిశీలించారు. అలాగే కృష్ణాపురం గ్రామానికి చెందిన రెవెన్యూ భూములు, దానికి సంబంధించిన వివరాలు గతంలోనే ఆర్డీవోకు నివేదించినట్లు తెలిపారు. ప్రస్తుతం కసింవలసపేట రెవెన్యూలో ఊసవానిపేట తదితర గ్రామాలకు చెందిన భూములను అంచనాలు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎల్‌ఎన్‌పేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

హిరమండలం: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హిరమండలం తహసీల్దార్ హనుమంతురావు, ఎల్‌ఎన్‌పేట ఉప తహసీల్దార్ నీలిమలు స్పష్టం చేశారు. హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా స్టాకు వివరాలపై ఆరా తీశారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్సు రద్దుచేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు బి.సంధ్య, కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలన మోసాలమయం



పొందూరు: క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలమయమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జిల్లాలోని ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాల అమలు తీరుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్ మరోసారి వచ్చేసినా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అమలు చేయలేమని తెలిసినా, ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి కూటమి నాయకులు ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పథకానికి ఇంకా అర్హులున్నా కొందరికే వేసి ప్రజలను మోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: రాణ పంచాయతీలో...



హిరమండలం: మిరియాపల్లిలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: లబ్బ పంచాయతీలో...



నరసన్నపేట: కోమర్తి పంచాయతీలో...



సారవకోట: శివరాంపురం పంచాయతీలో...

తాగునీరు అందించరూ..!

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్ రెండోవీధికి తాగునీటి కోసం బోరు తవ్వారు. అయితే ఇంతవరకు తాగునీరు అందించలేదని వైఎస్సార్ సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీవో వాన రవీంద్ర ప్రసాద్, పంచాయతీ ఈవో యు.రామచంద్రరావుకు శుక్రవారం తెలియజేశామన్నారు.